అక్రమ నిర్మాణాలు..
అదనపు అంతస్తులు

● నివాసిత ప్రాంతాల్లో భారీగా కమర్షియల్ భవనాలు ● కూల్చేయాలని హైకోర్టు ఆదేశించినా చేష్టలుడిగిన జీహెచ్‌ఎంసీ


వెంగళరావునగర్ ప్రభుత్వ పాఠశాల వెనక వీధిలో అక్రమ నిర్మాణం

బంజారాహిల్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రయోజనాలను దృష్టిలోపెట్టుకొని, భవిష్యత్తు తరాలకు ఇబ్బంది కలగవద్దనే ఉద్దేశ్యంతో చెరువులు, కుంటల్లో వెలిసిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తుంటే.. అదే ఉత్సాహంలో అక్రమ నిర్మాణాల పని పట్టాల్సిన జీహెచ్‌ఎంసీ అధికారులు జేబులు నింపుకుంటున్నారు. ఇది అక్రమ నిర్మాణం బాబోయ్ చర్యలు తీసుకోండి అంటూ ఫిర్యాదులు వెల్లువెత్తినా సరే తమకేం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అంతే గాకుండా నిర్మాణదారులతో ఫిర్యాదు చేస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారు.

సర్కిల్-19 పరిధిలో..

ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 పరిధిలోని మధురానగర్, వెంగళరావునగర్, సిద్ధార్థనగర్, రెహ్మత్‌నగర్, బోరబండలో అక్రమ నిర్మాణాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. చిన్నపాటి స్థలంలో ఆరు అంతస్తులు,

అనుమతి మూడంతస్తులు.. కట్టేది ఆరు..

మధురానగర్, వెంగళరావునగర్‌లో ప్రధాన రహదారులు తప్పితే మిగతావన్నీ కూడా నివాసిత ప్రాంతాలే. ఇక్కడ 300 నుంచి 200 గజాల వరకు ప్లాట్లు ఉన్నాయి. ఈ స్థలం కొలమానం ప్రకారం జీహెచ్‌ఎంసీ అనుమతితో జీ ప్లస్ రెండు లేదా మూడు అంతస్తుల నిర్మాణాలు చేపట్టాలి. అలా కాకుండా నిర్మాణదారులు ఏకంగా ఆరు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. సెట్ బ్యాక్ కూడా వదలకుండా రోడ్డుపైకి బాల్కానీ పెడుతూ మరీ నిర్మాణాలు చేపడుతున్నారు.

నివాసిత ప్రాంతాల్లో కమర్షియల్ భవనాలు వెలుస్తున్నాయి. తద్వారా మౌలిక వసతులు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారు. సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మాణాలు జరుగుతుండడంతో పక్కనే ఉంటున్న వారికి కనీసం గాలి వెలుతురు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ విషయం తెలిసినప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అందినకాడికి దోచుకుంటూ అక్రమ నిర్మాణాలకు ఊతమిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాల వెనక వీధిలో..

వెంగళరావునగర్ ప్రభుత్వ పాఠశాల వెనక వీధిలో ఓ వ్యక్తి జీ ప్లస్ మూడు అంతస్తుల నిర్మాణానికి అనుమతి తీసుకున్నారు. ఇది పక్కా నివాసిత ప్రాంతం. అంతేగాకుండా 30 అడుగుల రోడ్డు ఉండడంతో సెట్‌బ్యాక్ తప్పనిసరిగా అనుసరించాలి. సదరు నిర్మాణదారుడు సెట్‌బ్యాక్ పాటించలేదు. ఇంతటితో ఆగకుండా జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారిని ప్రసన్నం చేసుకొని నాలుగో అంతస్తు వేశాడు. ఇందులో హాస్టల్ లేదా హోటల్ ఏర్పాటు చేయాలని నిర్మాణదారుడి భావన. ఇదే జరిగితే తాము నివాసం ఉండడం ఇబ్బందికరంగా మారుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో కాలనీవాసులు హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన కోర్టు ఈ యేడాది జనవరిలో నిర్మాణాలను వెంటనే నిలిపేయడంతో పాటు అక్రమంగా నిర్మించిన వాటిని కూల్చివేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించింది. టౌన్‌ప్లానింగ్ అధికారులు 48ఎ కింద నోటీసు కూడా జారీ చేశారు. ఆ తర్వాత రెండు నెలలపాటు మౌనంగా ఉన్న నిర్మాణదారుడు ఇప్పుడు అదనపు అంతస్తు పనులు వేగం చేశాడు. స్థానికులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. పైగా ఓ అధికారి ప్రోద్బలంతో సదరు అక్రమ నిర్మాణదారుడు హైకోర్టుకు వెళ్లిన వారిపై తప్పుడు కేసులు పెట్టారు. ఇప్పుడు నిర్మాణదారుడు ఏకంగా మరో అంతస్తు నిర్మించేందుకు పిల్లర్లు వేశాడు. హైకోర్టు ఆదేశాలను సైతం పట్టించుకోకపోతే తాము ఇంకెవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా, ఇదే కాలనీలో మరో నిర్మాణదారుడు కేవలం 300 గజాల స్థలంలో ఆరు అంతస్తుల నిర్మాణం చేపట్టాడు. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే తన వెనక రాజకీయ నాయకులు ఉన్నారంటూ బెదిరిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

అద్దెలు భారీగా వస్తుండడంతో..

కాలనీలతోపాటు బస్తీల్లో ఇంటి అద్దెలకు మంచి డిమాండ్ ఉంది. ప్రైవేట్ హాస్టళ్లకు మంచి డిమాండ్ ఉండడంతో స్థల యజమానులు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. భారీ అద్దె వస్తుందని ఇతరులకు ఇబ్బంది కలిగేలా నిర్మాణాలు చేపడుతున్నారు. మధురానగర్‌లో ఇదేవిధంగా ఓ వ్యక్తి నివాసిత వీధిలో ఆరు అంతస్తుల నిర్మాణం చేపట్టి హాస్టల్‌కు అద్దెకిచ్చాడు. సంజీవరెడ్డినగర్ ప్రధాన రహదారికి దగ్గరగా ఉన్న వెంగళరావునగర్, శ్రీనివాసకాలనీ వీధుల్లో మొత్తం భవనాలన్నీ హాస్టళ్లకు అద్దెకు ఇవ్వడంతో ఇక్కడ నివాసముంటున్న వారు ఇళ్లు కాళీ చేసి మరో ప్రాంతానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రెహ్మత్‌నగర్, జవహర్‌నగర్‌లో కేవలం అరవై గజాల స్థలంలో కొందరు ఆరు అంతస్తుల భవనాలను నిర్మించారు. వీటిపై జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదులు అందినా వారు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.


విద్యార్థినులతో మేయర్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి

అన్నిరంగాల్లో అమ్మాయిలు మెరుగ్గా రాణిస్తున్నారు

● మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అన్నిరంగాల్లో అమ్మాయిలు మెరుగ్గా రాణిస్తున్నారని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. టచ్ ఎ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్డునంబర్.12 ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఎడ్యుకేషన్ క్యాంపు జరిగింది. విద్యార్థినులకు అనేక అంశాల్లో పోటీలు నిర్వహించి స్కాలర్‌షిప్, సర్టిఫికెట్లు అందజేశారు. విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యారంగంలో బాలికలు విశేష ప్రతిభను కనబరుస్తున్నారన్నారు. ఎటువంటి పోటీ పరీక్ష నిర్వహించినా అమ్మాయిలదే పై చేయి అవుతుందన్నారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న బాలికలకు చేయూతనందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి మాట్లాడుతూ బాలికలను ప్రోత్సహించేందుకు ఎడ్యుకేషన్ క్యాంపులు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు విభూది జైన్, రినా హిండోచా తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థిని శ్వేతకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

విద్యార్థులకు నగదు బహుమతులు

సనత్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆలివ్ మిఠాయి సంస్థ అధినేత దొరరాజు నగదు బహుమతులు అందజేయడం అభినందనీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన బాలానగర్, కూకట్‌పల్లి మండలాల్లోని 14 పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఆదివారం సన్మానించి, నగదు బహుమతులు అందజేశారు. సనత్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని శ్వేతకు ఎమ్మెల్యే బహుమతి అందజేశారు. అనంతరం దొరరాజును అభినందించారు. దొరరాజు మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు పదో తరగతిలో పదో గ్రేడ్ సాధించిన వారికి లక్ష రూపాయలు ఇస్తామని గతంలో చెప్పామని, ఈ సంప్రదాయం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సర్దార్‌ను అభినందిస్తున్న అపార్ట్‌మెంట్‌వాసులు

శ్రీసాయి రెసిడెన్సీ నూతన కార్యవర్గం

ఎర్రగడ్డ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌లోని శ్రీ సాయి రెసిడెన్సీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మహ్మద్ సర్దార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అపార్ట్‌మెంట్‌వాసులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జి.పుష్పలీల, ప్రధాన కార్యదర్శిగా శ్రీరామమూర్తి, సంయుక్త కార్యదర్శిగా సి.భాగ్యరేఖ, కోశాధికారిగా సీతారత్నం, సభ్యులుగా ఉమాదేవి, ఎం. సువర్చల, సి.హేమ, విజయ, నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సర్దార్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

రవీంద్రనగర్‌కాలనీ నూతన కార్యవర్గం

సనత్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్ బీకేగూడ రవీంద్రనగర్‌కాలనీ అధ్యక్షుడిగా టి.విజయ్‌సింగ్ ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో విజయ్‌సింగ్ నాలుగోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్‌వీ రమణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కిరణ్, కిషోర్, ఎన్.సుదర్శన్, సభ్యులను ఎన్నుకున్నారు.


విజయ్‌సింగ్


తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఘనంగా తీజ్ వేడుకలు

మియాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నడిగడ్డ తండాలో ఆదివారం తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ గిరిజనులు ఆనందంగా జరుపుకునే పండుగ తీజ్ అని అన్నారు. ఈ సందర్భంగా గిరిజనులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని, భారత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడిన మహనీయుడు సేవాలాల్ మహరాజ్ అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహన్ ముదిరాజ్, గంగాధర్, తండావాసులు స్వామి, తిరుపతి, శంకర్ నాయక్ పాల్గొన్నారు.


క్యారమ్ బోర్డు అందజేస్తున్న దినేష్ చౌదరి తదితరులు

అనాథాశ్రమాలకు దుస్తులు, క్రీడా పరికరాలు

ఎర్రగడ్డ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్‌లోని జీవోదయ బాలికల అనాథాశ్రమం, సారథినగర్‌లోని ఆదర్శ బాలుర అనాథాశ్రమాల్లో చిన్నారులకు దుస్తులు, క్రీడా పరికరాలను బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ దినేష్ చౌదరి ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సోదరుడు ధీరజ్ చౌదరి వర్ధంతిని పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రవీణ్, అమర్, ప్రకాష్‌రెడ్డి, అజయ్, వంశీ, స్వామి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనానికి ప్రయత్నిస్తూ వ్యక్తి మృతి

యూసుఫ్‌గూడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దొంగతనం చేసేందుకు ప్రయత్నిస్తున్న ఓ వ్యక్తి ప్రమాదశాత్తు మృతి చెందాడు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ మెట్రో స్టేషన్ సమీపంలో అగ్రాస్వీట్స్ ఎందుట గల ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో చోరీ చేసేందుకు ఆదివారం తెల్లవారు జామున ఓ వ్యక్తి ప్రయత్నించాడు. డబ్బాకు ఉన్న ఒక సైడ్ మూత తీశాడు. మరో వైపు మూత తీసేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు డబ్బా అతడిపై పడడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. ఉదయం 6 గంటల సమయంలో గమనించిన పోలీసులు డబ్బా తీసి చూడగా వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. పండ్ల వ్యాపారిని కొట్టి చంపారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇలాంటి వార్తలను ప్రచారం చేసే ముందు పోలీసులను అడిగి నిజాలు తెలుసుకోవాలని, అసత్యాలను ప్రచారం చేసి ప్రజల్లో భయాందోళనలను రేకెత్తించడం తగదన్నారు.

ఉద్యోగం, రుణం ఇప్పిస్తానని మోసం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం, లోన్లు ఇప్పిస్తానని పలువురిని మోసం చేశాడు ఓ వ్యక్తి. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ ప్రాంతానికి చెందిన జి.నర్సింగరావు ఐటీలో పనిచేసి రిటైర్ అయ్యారు. అతడికి మార్చిలో ఎం.ఉమామధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. మీ ఇంటికి వాస్తు దోషం ఉందని, అందుకే ఆర్థిక ఇబ్బందులు వస్తున్నాయని, రూ. 30 లక్షల రుణం ఇప్పిస్తానని నమ్మించాడు. ఇందుకు రూ. 2 లక్షలు ఖర్చవుతుందని ఉమామధుసూదన్‌రెడ్డి చెప్పగా.. నర్సింగరావు నమ్మి జూన్‌లో అతడికి రూ. 2 లక్షలు ఇచ్చాడు. నెల రోజుల్లో లోను ప్పిస్తానని చెప్పి తప్పించుకు తిరుగుతున్నాడు. బాధితుడు అతడి ఇంటికి వెళ్లగా సుమాంజలి, సంతోష్, రాకేష్ మాయమాటలు చెప్పి పంపిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఎల్లారెడ్డిగూడలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఎస్.రాంబాబు అనే వ్యక్తి కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని మధుసూదన్‌రెడ్డి రూ. 3 లక్షలు, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని లక్ష రూపాయలు తీసుకున్నాడు. రాంబాబు డబ్బులు తిరిగి ఇవ్వమని అడగగా తప్పించుకు తిరుగుతున్నాడు. గట్టిగా అడగటంతో చెక్కులు ఇచ్చాడు. వాటిని బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యాయి. బాధితులు అతడి ఇంటికి వెళ్లగా తాళం వేసి ఉండడంతో మోస పోయామని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమీర్‌పేటలో వృద్ధుడి అదృశ్యం

అమీర్‌పేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి అమీర్‌పేట డివిజన్ కుమ్మరిబస్తీకి చెందిన సర్దార్ దీప్‌సింగ్(65) ఈనెల 20న ఉదయం 7గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి కుమారుడు సుమిత్‌సింగ్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సర్దార్ దీప్‌సింగ్(ఫైల్)

● తొలగించని విక్రయదారులు ● పట్టించుకోని అధికారులు

ఏడాదిగా..
రహదారి పక్కనే గణేశ్ విగ్రహాలు


ఏడాదిగా ఎర్రగడ్డ జాతీయ రహదారి పక్కన ఉన్న వినాయక విగ్రహాలు

గత సంవత్సరం వినాయక చవితికి తయారు చేసిన విగ్రహాలు నేటికీ ఎర్రగడ్డ జాతీయ రహదారి పక్కన దర్శనమిస్తున్నాయి. వానకు తడుస్తూ.. ఎండకు ఎండుతున్నాయి. తయారీదారులు, అధికారులు ఇప్పటి వరకూ తొలగించలేదు.

ఎర్రగడ్డ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ గోకుల్ థియేటర్, మూసాపేట నుంచి ఈఎస్ఐ ఆస్పత్రి వరకు వెళ్లే రహదారిలో ఫుట్‌పాత్‌పై ప్రతీ యేడు వినాయక చవితికి సుమారు 15, 20 అడుగుల విగ్రహాలను విక్రయిస్తుంటారు. గతేడాది కొన్ని విగ్రహాలు మిగిలిపోయాయి. విక్రయదారులు ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా కొన్ని, సెయింట్ థెరిసా ఆస్పత్రి వద్ద కొన్ని, హీరోహోండా షోరూం వద్ద కొన్ని విగ్రహాలను అలాగే వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తొలగించాలని పలువురు కోరుతున్నారు.

సమాచారం ఇచ్చినా స్పందించడం లేదు..

వినాయకచవితి దగ్గరలో ఉందని, విగ్రహాలను తొలగించాలని గత సంవత్సరం విక్రయదారులకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదు. పలుసార్లు ఫోన్ చేస్తున్నా పట్టించుకోవడం లేదు. మేము కొత్త విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులైనా పాత విగ్రహాలను తొలగిస్తే బాగుంటుంది.

\- రాజాసింగ్, ఫతేనగర్

పేరుకుపోయిన చెత్తకుప్పల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎర్రగడ్డ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): 'పేరుకుపోతున్న చెత్త కుప్పలు' అనే శీర్షికతో ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను ఆదివారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. దీంతో ప్రస్తుతం పరిసరాలు శుభ్రంగా కనిపిస్తున్నాయి. స్థానికులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.


పేరుకుపోతున్న చెత్తకుప్పలు

ఆదివారం ప్రచురితమైన కథనం


నేతాజీనగర్‌లో చెత్తకుప్పలను తొలగించిన అనంతరం..


బి.శంకర్‌లాల్‌నగర్‌లో..

విద్యుత్ ఉద్యోగుల్లో ప్రమోషన్ ఉత్సాహం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులకు పదోన్నతులను కల్పించి ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు కొత్త ఉత్సాహం నింపాయని గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్, రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ పవర్ కోటేశ్వరరావు అన్నారు. ఖైరతాబాద్ మింట్‌కాంపౌండ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోని సమస్యల పరిష్కారంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించడం, వాటిని పరిష్కరించడం శుభపరిణామమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తీసుకుంటున్న కీలక నిర్ణయాలతో విద్యుత్ పంపిణీ సంస్థలు, ట్రాన్స్‌కో, జెన్‌కోలో సుమారు 5 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు లభించాయన్నారు. నిబంధనల ప్రకారం ఉద్యోగులకు చెందాల్సిన పదోన్నతులు కల్పిస్తే ప్రతియేటా అన్ని శాఖల్లో వేలసంఖ్యలో ఉద్యోగ ఖాళీలు ఏర్పడి నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కొంత మంది, కొన్ని సంఘాలు తమ స్వార్థం కోసం పదోన్నతుల అంశంపై నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారని వాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తామని అన్నారు. ఒకవేళ ఎక్కడైనా పొరపాట్లు జరిగినట్లు భావిస్తే చర్చలతో వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు.


వీధిదీపాల వెలుగులకు నోచని మహాభారత్‌నగర్‌లోని ఓ వీధి

చాలాచోట్ల వెలగని వీధిదీపాలు

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ఖైరతాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లో పలు చోట్ల వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఖైరతాబాద్ మహాభారత్‌నగర్‌లో దాదాపు రెండు నెలలుగా వీధిదీపాలు వెలగడం లేదు. నెహ్రూనగర్, న్యూ సీఐబీ క్వార్టర్స్, ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్, ఇందిరానగర్‌కాలనీ, బీజేఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక రాత్రివేళ చీకట్లు అలుముకుంటున్నాయి. మహాభారత్‌నగర్‌లో రాత్రిపూట అసాంఘిక శక్తులు రాజ్యమేలుతున్నాయి. దొంగతనాలు జరుగుతున్నాయి. యువత రోడ్లపైనే మద్యం తాగుతూ రాకపోకలు సాగించే వారిని వేధిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వీధిదీపాలు వెలగడం లేదని డీఈతో పాటు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి గణపతి ప్రతిమను, ప్రసాదాన్ని అందజేస్తున్న ఆలయ మాజీ కమిటీ సభ్యులు

దేవాలయాల అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎంతో చరిత్ర కలిగిన సికింద్రాబాద్‌లోని గణేశ్ దేవాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. సికింద్రాబాద్ స్టేషన్ రోడ్డులోని గణేశ్ దేవాలయం నిర్మించి 200 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమేరకు ఆలయ మాజీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్ మారేడుపల్లిలోని ఆయన నివాసంలో కలిసి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా తలసాని ఆలయ అభివృద్ధి, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వచ్చే నెలలో ప్రారంభం కానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ కమిటీ ఛైర్మన్ సత్యనారాయణ, సభ్యులు హన్మంతరావు, వినోద్‌కుమార్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.



వినాయక మండప నిర్వాహకులతో మాట్లాడుతున్న తుకారాంగేట్ సీఐ శంకర్‌నాయక్

మండపాలకు 27 నుంచి అనుమతులు

అడ్డగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గణపతి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలని తుకారాంగేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ సూచించారు. ఆదివారం సాయంత్రం తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐలు నరేశ్, వెంకటేశ్‌తో కలిసి మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ 27వ తేదీ నుంచి సెప్టెంబర్ 4 వరకు అనుమతులిస్తామని, మండపాలు ఏర్పాటు చేసేవారు మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుని, ఆ రసీదును పోలీసులకు ఇవ్వాలని సూచించారు. మండపాల వద్ద డీజేలకు అనుమతిలేదని, నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి మండపానికి రెండు స్పీకర్లు పెట్టుకునేందుకు అనుమతి ఇస్తామని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేముందు ఎలాంటి గొడవలు గాకుండా చూసుకునే బాధ్యత మండప నిర్వాహకులదేనన్నారు. వినాయకుడి నిమజ్జనం, ఊరేగింపు సమయంలో బయటి వ్యక్తులు ఎవరినీ అనుమతించకూడదని, లేదంటే గొడవలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. మండపాల నిర్వాహకులకు ఇబ్బందులుంటే 8712660220 నంబరుకు వాట్సాప్ మెసేజ్ చేయాలని సూచించారు.



సాయిరాజేష్ యాదవ్‌ను సత్కరిస్తున్న జంపన తదితరులు

క్రీడాకారులకు అండగా ఉంటాం

● అసోసియేషన్ ఛైర్మన్ జంపన ప్రతాప్

సికింద్రాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లో క్రీడాకారులకు అండగా నిలిచేందుకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని అసోసియేషన్ ఛైర్మన్ జంపన ప్రతాప్ అన్నారు. ధూల్‌పేట్ స్టేడియంలో ఇటీవల జరిగిన కుస్తీ పోటీల్లో కాంస్య పతకం సాధించిన కంటోన్మెంట్ క్రీడాకారులు సాయిరాజేష్ యాదవ్‌ను ఆదివారం బోయినపల్లి ప్లేగ్రౌండ్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రాంతంలో అనేక మంది క్రీడాకారులు పలు క్రీడాపోటీల్లో మంచి ప్రతిభ ప్రదర్శిస్తున్నారని అన్నారు. అటువంటి వారికి క్రీడల్లో మరింత రాణించేందుకు అవసరమైన ఆర్థిక సహకారంతోపాటు ఇతర సహాయ సహకారాలను తాము అందిస్తున్నట్టు వెల్లడించారు. కుస్తీ కోచ్ సాయిబాబా యాదవ్, నాయకులు ముప్పిడి మధుకర్, రాజుయాదవ్, ముఖేష్ యాదవ్, ఓంప్రకాష్‌యాదవ్, కుమార్, హరి, సురేష్, విఠల్‌యాదవ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ అందజేస్తున్న బ్లూ ఫౌండేషన్ సభ్యులు

ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ అందజేత

అడ్డగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు రుతుస్రావం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారంపై ఆదివారం తుకారాంగేట్‌లోని వడ్డెర బస్తీ అంగన్‌వాడి పాఠశాలలో బ్లూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అడ్డగుట్టకు చెందిన 60 మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం రుతుస్రావం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహనకల్పిస్తూ మహిళలకు శానిటరీ ప్యాడ్స్ ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శోభారాణి, సుష్మ, సుమతి పాల్గొన్నారు.



మీట్ యువర్ మెంబర్ కార్యక్రమంలో జె.రామకృష్ణ

మార్పు మనతోనే మొదలవ్వాలి

● జె.రామకృష్ణ

మారేడుపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మంచి కోసం మార్పు మనతోనే మొదలవ్వాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జన్యావుల రామకృష్ణ అన్నారు. మీట్ యువర్ మెంబర్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహేంద్రహిల్స్‌లోని సంజీవ్‌నగర్ కాలనీలో పర్యటించిన రామకృష్ణ కాలనీవాసులతో చర్చించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానికులు రామకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.... సమాజంలో మంచి కోసం మనం ముందు ఉండాలని, ప్రతి ఒక్కరూ చుట్టుపక్కల పరిశుభ్రత పాటించాలని, మనం బాగుంటే మన కాలనీలు శుభ్రంగా ఉంటాయని అన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని కాలనీవాసులకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంజీవ్‌నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

వెస్ట్ మారేడుపల్లిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ..

ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ కాంతులతో మైమరపించే భారీ సుస్వాగతం కమాన్లు

మారేడుపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ మారేడుపల్లిలో ఈనెల 27న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కంటోన్మెంట్ యాదవ సంఘం అధ్యక్షుడు సి.సంతోష్ యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు మారేడుపల్లి ప్రధాన మార్గాల్లో విద్యుత్ సుస్వాగతం భారీ కమాన్లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా శ్రీకృష్ణుని ఆకారాన్ని సూచించే వివిధ రకాల చిత్రాలు, విభిన్నమైన అలంకరణ కలిగిన విద్యుత్ బల్బులతో ఏర్పాటుచేసిన దేవతామూర్తుల ఆకారాలు ఎంతగానో భక్తులను, చూపరులను ఆకట్టుకున్నాయి.

చిన్నారులను సైతం ఆకట్టుకునే విధంగా చిత్రకళాకారులు వినూత్నంగా బోర్డులపై గీసిన బొమ్మలపై రంగురంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటుచేశారు. అదేవిధంగా మారేడుపల్లి పరిసర ప్రాంతాలు విద్యుత్ కాంతులతో జిగేల్‌మంటున్నాయి. దీంతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఈ ప్రాంతమంతా సర్వం సిద్ధం చేశారు. అదే రోజు సాయంత్రం ఓల్డ్ మారేడుపల్లిలోని యాదవ సంఘం అధ్యక్షుడు సంతోష్ యాదవ్ నివాసంలో రాత్రి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ప్రజాప్రతినిధులు, భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొంటారని పేర్కొన్నారు.

నేటి నుంచి సీతాఫల్‌మండిలో ..

బౌద్ధనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండిలో త్రీస్టార్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి శ్రీకృష్ణాష్టమి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఛైర్మన్ డి.చెన్నయ్యగౌడ్, అధ్యక్షుడు బొగ్గులకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మణరావులు తెలిపారు.

సీతాఫల్‌మండి సందీప్ ఆయిల్ వీధి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టేజీపై శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద మూడురోజుల పాటు 28వ తేదీ వరకు ప్రత్యేక పూజలు జరుగుతాయని వారు తెలిపారు. ఈవేడుకల్లో సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్, డీజీపీ సౌమ్యమిశ్రా, మాజీ మేయర్ బండకార్తీక రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్, సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమతో పాటు వివిధ విభాగాల అధికారులతో పాటు ఉన్నతాధికారులు పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షుడు బొగ్గుల కృష్ణ, ఛైర్మన్ చెన్నయ్యగౌడ్ తెలిపారు.





వెస్ట్ మారేడుపల్లిలో విద్యుత్ కాంతులతో ఆకర్షణీయంగా స్వాగత కమాన్లు



బస్తీ సమస్యలను డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డికి వివరిస్తున్న వినోభానగర్ బస్తీవాసులు

సమస్యల పరిష్కారానికి కృషి

● డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి

తార్నాక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): లాలాపేట్‌లోని వినోభానగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి అన్నారు. వినోభానగర్ బస్తీవాసులు ఆదివారం డిప్యూటీ మేయర్‌ను తార్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో కలిసి బస్తీ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు శ్మశానవాటిక అభివృద్ధితో పాటు, రోడ్డు వైండింగ్, పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే కృష్ణారావు నుంచి అవార్డు తీసుకుంటున్న విద్యార్థిని శ్వేత

విద్యార్థులకు మెరిటేరియస్ అవార్డులు

సనత్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆలివ్ స్వీట్స్ అందించే మెరిటేరియస్ అవార్డుల ప్రదానం కార్యక్రమం ఆదివారం హోటల్ తబలాలో నిర్వహించారు. సనత్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని శ్వేతకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు అవార్డు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆలివ్ స్వీట్స్ అధినేత దొరరాజు బాలానగర్, కూకట్‌పల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో టాపర్‌గా నిలిచిన వారికి రూ.10 వేల చొప్పున నగదు బహుమతి అందజేశారు. 10/10 జీపీఏ సాధించిన వారికి రూ.లక్ష బహుమతిని దొరరాజు ప్రకటించారు.

ఏకీకృత పెన్షన్ అమలు కార్మిక విజయం

● మర్రి రాఘవయ్య

చిలకలగూడ, ఆగస్ట్ 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల పోరాటంతో ఏకీకృతపెన్షన్ అమలుకు చర్యలు చేపట్టడం హర్షణీయమని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 1 ఏప్రిల్ 2025 నుంచి అమలు కానున్న ఈ పథకం ద్వారా పదవీ విరమణ చేసే ఉద్యోగులకు సామాజిక భద్రత లభిస్తుందని, సమాజంలో తలెత్తుకుని జీవనం సాగించవచ్చునని సంతోషం వ్యక్తం చేశారు. పదవీ విరమణ చేసే రైల్వే ఉద్యోగులు, కార్మికులకు ఈ పెన్షన్ అమలు వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందని రైల్వే ఉద్యోగులు, కార్మికులు ఆనందంగా ఉన్నారని తెలిపారు. కనీస వేతనం రూ.32,500గా నిర్ణయించాలని, పాత పెన్షన్‌లో అమలు చేస్తున్నట్లు వయసు పెరిగిన ప్రకారం పెన్షన్‌ను సవరించాలని, రైల్వేలో పోస్టుల భర్తీకి ఉన్న నిషేధాన్ని తొలగించాలని, 20సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసిన వారికి పూర్తి పెన్షన్ చెల్లించాలని సూచించినట్లు తెలిపారు.

పెన్షన్‌తో ధైర్యం

16 మార్చి 2005న రైల్వేలో చేరాను. కొత్తగా అమలు చేయనున్న పెన్షన్ పథకం పదవీ విరమణ చేసే వారికి ప్రయోజనకరంగా ఉంది. రోజురోజుకి పెరుగుతున్న ధరలతో ప్రస్తుత పరిస్థితుల్లో జీవనం సాగించడం కష్టంగా మారింది. 30 నుంచి 35సంవత్సరాలు ప్రభుత్వ సేవలో ఉన్న ఉద్యోగులకు ఏకీకృత పెన్షన్ పథకం వల్ల ధైర్యంగా జీవనం సాగించే వీలు ఉంటుంది.

\- బి.సునీల్ కుమార్ (రైల్వే ఉద్యోగి)

పెన్షన్‌తో భద్రత

ఏకీకృత పెన్షన్ అమలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వరం లాంటిది. సమష్టి కృషి, పోరాటాల వల్ల ఈ విజయం సాధించాం. ధర్నాలు, ర్యాలీలలో పాల్గొని మద్దతు తెలిపిన వారి సహకారంతోనే ఇది సాధ్యమయింది.

\- షేక్ రవూఫ్ (ద.మ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ మీడియా ప్రతినిధి)

అనాథాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

ముషీరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నవభారత, వనితా లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు డాక్టర్ జ్యోతిరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షురాలు హిప్నో పద్మాకమలాకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. చదువుతోపాటు ప్రతిరోజు వ్యాయామం చేయాలని అప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కృష్ణవేణి, రెయిన్‌బో హోం ఇన్‌చార్జి సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మట్టిపెల్లి రామచంద్రుకు ఓయూ డాక్టరేట్



తార్నాక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలానికి చెందిన మట్టిపెల్లి రామచంద్రు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. గణిత శాస్త్ర విభాగంలో ప్రొ. చెన్న కృష్ణారెడ్డి పర్యవేక్షణలో హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ అనాలసిస్ ఆఫ్ ఎం.ఎచ్.డి నాన్ - న్యూటోనియన్ నానో ఫ్లూయిడ్స్ ఫ్లో విత్ గైరోటాక్టిక్ మైక్రో ఆర్గానిసమ్స్ ఇన్ ఎ పోరస్ మీడియం ఓయవర్ డిఫరెంట్ జామెట్రీస్ అనే అంశంపై పరిశోధనలు పూర్తి చేసినందుకుగాను డాక్టరేట్ పట్టాను అందుకున్నానని ఆదివారం ఆయన తెలిపారు. రామచంద్రు ప్రస్తుతం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

రవీంద్రనగర్‌కాలనీ నూతన కార్యవర్గం



విజయ్‌సింగ్

సనత్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్ బీకేగూడ రవీంద్రనగర్‌కాలనీ అధ్యక్షుడిగా టి.విజయ్‌సింగ్ ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో విజయ్‌సింగ్ నాలుగోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్‌వీ రమణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కిరణ్, కిషోర్, ఎస్.సుదర్శన్, సభ్యులను ఎన్నుకున్నారు.

ఇష్టారాజ్యంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు

● లాలాపేట్ బస్తీవాసుల ఆగ్రహం

● 30 ఫీట్ల రోడ్డు మార్గంలో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్

తార్నాక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): లాలాపేట్‌లో విద్యుత్ అధికారులు విద్యుత్ స్తంభాలను తమ ఇష్టారాజ్యంగా ఇరుకు గల్లీలో ఏర్పాటు చేయడం పట్ల బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు ఆదివారం లాలాపేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బస్తీవాసులు మాట్లాడుతూ లాలాపేట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌కు కరెంటు కనెక్షన్ నిమిత్తం విద్యుత్ అధికారులు ముందుగా నిర్ణయించిన ప్రకారం 30ఫీట్ల రోడ్డు మార్గంలో కాకుండా 10ఫీట్ల రోడ్డు మార్గంలో కరెంటు స్తంభాన్ని ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేంటని ప్రశ్నించిన బస్తీవాసులపై కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా బెదిరింపులకు పాల్పడుతూ భయాందోళనలకు గురిచేస్తున్నాడని వాపోయారు. బస్తీవాసులపై బెదిరింపులకు పాల్పడుతున్న కాంట్రాక్టర్‌ను విద్యుత్ అధికారులు వెంటనే తొలగించాలని, లేని పక్షంలో విద్యుత్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. 10 ఫీట్ల రోడ్డు మార్గంలో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్‌లో స్థానికులు విద్యుత్ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి అండర్ గ్రౌండ్ కేబుళ్లను, విద్యుత్ స్తంభాన్ని వెడల్పుగా ఉన్న 30 ఫీట్ల రోడ్డు మార్గంలో వేయాలని డిమాండ్ చేశారు.

పలుచోట్ల వెలగని వీధిదీపాలు

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ఖైరతాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లో పలుచోట్ల వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఖైరతాబాద్ మహాభారత్‌నగర్‌లో దాదాపు రెండు నెలలుగా వీధి దీపాలు వెలగడంలేదు. నెహ్రూనగర్, న్యూ సీబీఐ క్వార్టర్స్, ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్, ఇందిరానగర్‌కాలనీ, బీజేఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక రాత్రివేళ చీకట్లు అలుముకుంటున్నాయి. మహాభారత్‌నగర్‌లో రాత్రిపూట అసాంఘిక శక్తులు రాజ్యమేలుతున్నాయి. దొంగతనాలు జరుగుతున్నాయి. యువత రోడ్లపైనే మద్యం తాగుతూ రాకపోకలు సాగించే వారిని వేధిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వీధి దీపాలు వెలగడం లేదని డీఈతో పాటు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సునీతాయాదవ్

డివిజన్‌లో సమస్యలను పరిష్కరిస్తా

మౌలాలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మౌలాలి డివిజన్‌లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని కార్పొరేటర్ సునీతాయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం డివిజన్‌లోని ప్రగతి నగర్‌లో యూజీడీ పనులకు కార్పొరేటర్ సునీతా యాదవ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ ఉదయ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సంజయ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు లింగారావు, డివిజన్ అధ్యక్షుడు సాయిబాబా, జనరల్ సెక్రటరీ శివగౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

దీన్‌దయాల్‌నగర్ అధ్యక్షుడిగా నరేష్

ముషీరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దీన్‌దయాల్‌నగర్ అధ్యక్షుడిగా ఎస్.నరేష్ ఎన్నికయ్యారు. ఆదివారం బస్తీలో జరిగిన ఎన్నికల్లో నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ దీన్‌దయాల్ నగర్ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎ.శ్రావణ్, ప్రధాన కార్యదర్శిగా ఎం. శ్రావణ్, కార్యదర్శిగా రాము, కోశాధికారులుగా శ్రీనివాస్, ధీరజ్‌కుమార్‌లు నియమితులైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ నాయకులు బీఆర్‌ఎస్ యువజన కమిటీ నాయకుడు ముఠా జైసింహను కలిసి ఆయనను సన్మానించారు. బస్తీ సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేయాలని ముఠా జైసింహ అన్నారు. కార్యక్రమంలో అడిక్‌మెట్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గోపి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుల మృతి

అడ్డగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో రోడ్డుపై చనిపోయి ఉన్న వృద్ధుడి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు గాంధీ మార్చురీకి తరలించారు. ఎస్సై సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. బోయగూడ చౌరస్తా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం నెంబరు 10 సమీపంలో గుర్తుతెలియని 75ఏళ్ల వయస్సు ఉన్న వృద్ధుడు చనిపోయి ఉన్నాడని సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మారేడుపల్లి పరిధిలో ..

మారేడుపల్లి : భిక్షాటన చేసుకునే 70సంవత్సరాల వయసు గల వృద్ధుడు అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన సంఘటన మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... పికెట్ జేబీఎస్ సిటీ బస్ స్టాపు వద్ద నరసింహ(70) అనే వృద్ధుడు స్పృహ తప్పి పడిపోయి వున్నాడు. సమాచారం అందుకున్న మారేడుపల్లి పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆచూకీ కోసం మారేడుపల్లి పోలీసులని సంప్రదించాలని కోరారు. స్పృహ వచ్చిన తరువాత మృతుడు పేరు మాత్రమే చెప్పాడని అడ్రస్. వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

సఖీ సెంటర్ నుంచి యువతి పరార్

అడ్డగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కౌన్సిలింగ్ కోసమని వచ్చిన ఓ బాలిక సఖీసెంటర్ నుంచి పారిపోయిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. లేఖ్ పోలీస్ స్టేషన్ మహిళా కానిస్టేబుల్ యశ్వతి ఈనెల 19వ తేదీన 18ఏళ్ల వయస్సు ఉన్న ఓ యువతిని కౌన్సిలింగ్ కోసమని సికింద్రాబాద్ ఎస్‌డీ రోడ్డులో ఉన్న సఖీ సెంటర్‌కు తీసుకొచ్చారు. కొద్ది నిమిషాల్లో టిఫిన్ కోసమని బయటికి వచ్చిన కానిస్టేబుల్‌తో పాటు సఖీ సెంటర్ నిర్వాహకురాళ్లను బాలిక నెట్టేసి పారిపోయింది. వెంటనే లేఖ్ పోలీసులు, సఖీ సెంటర్ నిర్వాహకులు సిటీలో కొన్ని ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. దాంతో సఖీ సెంటర్ ఇన్‌చార్జి విద్య ఆదివారం గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో బాలిక మిస్సింగ్ కేసు కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాలిక ఆచూకీ తెలిస్తే వెంటనే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

అమీర్‌పేటలో వృద్ధుడి అదృశ్యం



సర్దార్ దీప్‌సింగ్

అమీర్‌పేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి అమీర్‌పేట డివిజన్ కుమ్మరిబస్తీకి చెందిన సర్దార్ దీప్‌సింగ్(65) ఈనెల 20న ఉదయం 7గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి కుమారుడు సుమిత్‌సింగ్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డా. బోనకుర్తి సోమేశ్వర్



తార్నాక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డా.బోనకుర్తి సోమేశ్వర్ ఎన్నియ్యారు. ఈమేరకు ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. డా.బోనకుర్తి సోమేశ్వర్ అధ్యక్షుడిగా ఎన్నిక కాగా, గౌరవ అధ్యక్షులుగా డా.గోవింద్ కందుల, డా.నర్సయ్య, కోశాధికారిగా డా.విష్ణు భూపతి, ఉపాధ్యక్షులుగా డా.వరలక్ష్మి, డా.శివశంకర్, డా.సత్యానారాయణరెడ్డి, డా.పరశురాం, డా.ప్రసన్న, డా.రవీందర్ ఎన్నికయ్యారు.



ఎడ్యుకేషనల్ ఐకాన్ అవార్డు తీసుకుంటున్న ప్రిన్సిపల్ శ్రీధర్

షిరిడీ సాయిబాబా హైస్కూల్ ప్రిన్సిపల్ శ్రీధర్‌కు ఎడ్యుకేషనల్ ఐకాన్ అవార్డు

అడ్డగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సమాజికవేత్త, విద్యాదాత తుకారాంగేట్‌లోని షిరిడీ సాయిబాబా హైస్కూల్ ప్రిన్సిపల్ ఎల్.శ్రీధర్‌కు ఎడ్యుకేషనల్ ఐకాన్ అవార్డు దక్కింది. హైద్రాబాద్‌లో ఆదివారం పార్క్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో యూనివర్సల్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ అవార్డును అందజేసింది. ప్రజల సంక్షేమ కోసం పాఠశాలలో విద్యాదాతగా పేరున్న ఆయన అవార్డు దక్కించుకున్నారు.



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు మండల రాధాకృష్ణ, వెంకటేష్ యాదవ్ తదితరులు

అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు

మౌలాలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మౌలాలి డివిజన్ పరిధి హిల్ టాప్ కాలనీలో ఆదివారం బోనాల పండుగ సందర్భంగా నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ దేవాలయం, పోచమ్మ దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో వివిధ పార్టీల సీనియర్ నాయకులు పాల్గొన్నారు.